నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 14 నవంబర్ 2024 | NALGONDA

ఎంజీయూ వెయిట్‌లిఫ్టింగ్ జట్టు ఎంపిక

ఎంజీయూ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు

రామగిరి, నవంబర్ 13: ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరుగనున్న అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొననున్న ఎంజీయూ టీమ్‌ను బుధవారం ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ సెక్రటరీ హరీశ్ కుమార్ తెలిపారు. 102 కిలోల విభాగంలో దాసరి జయశీల్(ఎంజీయూ), 96 కిలోల విభాగంలో అభినయ్(ఎంజీయూ), 89 కేజీలు-ముకర్రం (విజేత కళాశాల మిర్యాలగూడ), 81 కేజీలు సింహాద్రి(ఎంజీయూ) యశ్వంత్ శ్రీకృష్ణ (ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల), 73 కేజీలు- ఉమర్ ఫరూక్(ఎంజీయూ), 61కేజీలు వికాస్, గోపాలకృష్ణ(ఫిజికల్ ఎడ్యుకేషనల్ కళాశాల), 55 కేజీలు షేక్ హఫీజ్(ఎన్జీ కళాశాల) ఎంపికైనట్లు పేర్కొన్నారు . ఎంపిక పోటీల్లో ఎంజీయూ పీడీ రమావత్ మురళి, సెలక్టర్లు ఎండీ. అష్రఫ్ ఆహ్మద్, కార్తీక్ పాల్గొన్నారు.

2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలకు..
బోనస్ సున్నా
మంత్రి కోమటిరెడ్డి సమీక్షలోనూ బోనస్‌పై మౌనమే

- నేరుగా మిల్లర్లకే అమ్ముకుంటున్న రైతులు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రాని సన్న వడ్లు
- తేమశాతం, ఇతర నిబంధనలే అడ్డంకి
- దొడ్డు వడ్లకు రూ.160కోట్లకు గానూ చెల్లించింది రూ.52కోట్లే
- ధాన్యం డబ్బుల చెల్లింపుల్లోనూ తీవ్ర జాప్యం

ప్రభుత్వం, మంత్రులు ఇప్పటికీ సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ఆర్భాట ప్రకటనలు బోగస్ అని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు మొదలై నెలరోజులు దాటినా నేటికీ ఆచరణలో ఎక్కడా ఒక్క క్వింటా సన్న వడ్లకు కూడా బోనస్ ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు గతంలో ఎన్నడూ సన్నవడ్లు వచ్చిన దాఖలాలు లేవు. కానీ ఇక్కడికి సన్నవడ్లను తెస్తేనే బోనస్ అని మెలిక పెట్టడంలోనే ప్రభుత్వ ఉద్దేశమేంటో స్పష్టం అవుతున్నది. దీంతో ఇప్పటికే నల్లగొండ జిల్లాలో రైస్ మిల్లర్లు కొనుగోలు చేసిన సన్నవడ్లు 2.83లక్షల మెట్రిక్ టన్నుల్లో ఒక్క టన్ను వడ్లకు కూడా బోనస్ వర్తించలేదు. కేవలం రైతులు మద్దతు ధరకు అటు ఇటుగా మిల్లర్లు చెప్పిన ధరకే సన్నాలను విక్రయించి మిన్నకుంటున్నారు. నిజంగా ప్రభుత్వానికి సన్నాలకు బోనస్ ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే రైస్‌మిల్లర్లకు అమ్మిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అయితే బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షలో సన్నాలు, వాటి బోనస్‌పై ఎలాంటి చర్చ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనల వల్ల ఇప్పటికే విక్రయించిన సన్నాలకు రూ.140 కోట్ల వరకు బోనస్‌కు ప్రభుత్వం ఎగనామం పెట్టినట్లే.

– నల్లగొండ ప్రతినిధి, నవంబర్13(నమస్తే తెలంగాణ)

నల్లగొండలోని ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం లోడింగ్ చేస్తున్న కార్మికులు

ఉమ్మడి జిల్లాలో పండించిన సన్నవడ్లల్లో మెజార్టీ భాగం మిర్యాలగూడ ప్రాంతంలోని రైస్‌మిల్లులకే తరలివస్తుంటాయి. సన్నాలను ఆరబెట్టడం, ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం రావడం, దుమ్ము దూళి లాంటి వాటి తొలగించడంలో ఉన్న సమస్యల నేపథ్యంలో నేరుగా రైస్‌మిల్లర్లకే విక్రయించడం ఆనవాయితీ. ప్రస్తుత వానకాలం సీజన్‌లోనూ రైతులంతా మిర్యాలగూడ ప్రాంత మిల్లులకే బారులు తీరారు. దాదాపు నెల రోజులుగా నాన్‌ఆయకట్టు నుంచి సన్నాలు రాగా, ప్రస్తుతం సాగర్ ఆయకట్టు నుంచి రాక మొదలైంది. ఇలా ఇప్పటికే జిల్లాలోని రైస్‌మిల్లర్లు 2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేసినట్లు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ వెల్లడించారు. ప్రతిరోజూ 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఆయకట్టులో వరికోతలు ముమ్మరం అయితే మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన సన్నాలకు మద్దతు ధరకు అటు ఇటుగానే రైతులకు ధర లభించింది. కానీ ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ మాత్రం వర్తించడం లేదు.

సన్నాలకు సున్నా బోనస్

ప్రభుత్వం ఈ సారి సన్నాల కొనుగోలు కోసమే 80 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. కానీ నేటికీ ఒక్క క్వింటా కూడా ఈ కేంద్రాలకు సన్నవడ్లు రాలేదని అధికారులే చెప్తున్నారు. సాగర్ ఆయకట్టులో కోతలు షురూ అయితే రావచ్చని భావిస్తున్నారు. కానీ ఆచరణలో సన్నవడ్లు కేంద్రాలకు రావడం దాదాపు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే గతంలో ఎన్నడూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నాలు వచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిబంధనల ప్రకారం సన్నవడ్లకు సైతం ఒక్క పైసా బోనస్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కానీ సన్నాల రైతులు ఇప్పటికే నేరుగా రైస్‌మిల్లర్లకు 2.83లక్షల మెట్రిక్ టన్నుల సన్నవడ్లను విక్రయించారు. కానీ ఇందులో ఒక్క టన్నుకు కూడా బోనస్ వర్తించలేదు. ఎందుకంటే ప్రైవేటుగా విక్రయిస్తే బోనస్ లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నది. వాస్తవంగా రైతులు ఇప్పటికే విక్రయించిన సన్నాలకు బోనస్‌ను వర్తింప చేస్తే రైతులకు రూ.140 కోట్ల వరకు డబ్బులు అదనంగా వచ్చేవి. కానీ అలాంటి పరిస్థితులు కనిపిస్తలేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధాన్యంపై జరిపిన సమీక్షలోనూ సన్నాల బోనస్ ఎక్కడా చర్చ రాకపోవడంతో ప్రభుత్వం ఎగ్గొట్టడానికే సిద్ధంగా ఉన్నట్లు రైతులు భావిస్తున్నారు. రైతులు మాత్రం రైస్‌మిల్లులకు విక్రయించిన సన్నవడ్లకు సైతం బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండడం విశేషం. ప్రభుత్వానికి నిజంగా బోనస్ ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే రైతు ఎక్కడ అమ్ముకున్నా ఇవ్వాలని కోరుతున్నారు.

దొడ్డు వడ్లకు చెల్లించింది రూ.52 కోట్లే..

మరోవైపు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా జరుగుతున్న కొనుగోళ్లల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా ధాన్యం డబ్బుల చెల్లింపులో ఆలస్యం అవుతున్నది. సివిల్ సప్లై అధికారుల లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో 340 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుపుతున్నారు. మంగళవారం నాటికి జిల్లాలో 69వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీని విలువ రూ.160.92 కోట్లుగా ప్రకటించారు. అయితే ఇందులో రైతులకు చెల్లించిన డబ్బులు మాత్రం రూ.52కోట్లే కావడం గమనార్హం. గతంలో మూడునాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాగా ప్రస్తుతం వారం నుంచి 15 రోజుల వరకు సమయం పడుతున్నది. ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం కావడం, ట్రక్‌షీట్లను పూర్తి చేయకపోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. ఇదే విషయమై బుధవారం మంత్రి కోమటిరెడ్డి సమీక్షిస్తూ దీనిపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసిందే. డబ్బుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యాన్ని గుర్తించి మరో రెండు రోజుల్లోనే ఇంకో రూ.50కోట్ల డబ్బులు చెల్లించాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

మిర్యాలగూడకు పోటెత్తిన ధాన్యం

ఒకే రోజు 5వేలకు పైగా ట్రాక్టర్లు రాక

మిర్యాలగూడ, నవంబర్ 13: వానకాలం సీజన్ వరి కోతలు ఊపందుకోవడంతో మిర్యాలగూడకు ధాన్యం పోటెత్తుతోంది. బుధవారం 5వేల ట్రాక్టర్లకు పైగా ధాన్యం మిల్లులకు వచ్చింది. ఈ సీజన్‌లో సన్నాలు సాగు చేసిన రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు మిల్లుల బాట పట్టారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 ఇస్తామని చెప్పినప్పటికీ 17శాతం తేమ నిబంధన పెట్టడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండా మిల్లులకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకు మిర్యాలగూడ పట్టణ పరిసర ప్రాంతాల్లోని 85 మిల్లుల్లో 3.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలో ఉన్నారు. ఆదివారం 3వేల ట్రాక్టర్ల ధాన్యం రాగా, బుధవారం కూడా 5వేల ట్రాక్టర్లకు పైగా ధాన్యం రావడంతో కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నల్లగొండతో పాటు సూర్యాపేట, భువనగిరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున సన్నరకం ధాన్యం వస్తున్నది. వేరే ప్రాంతాల్లో సన్నరకాలకు సరైన ధర ఇవ్వకపోవడం, మిర్యాలగూడలో ధర పెంచి ఇవ్వడంతో రైతులందరూ మిర్యాలగూడలోని మిల్లుల్లో ధాన్యం అమ్ముకునేందుకు వస్తున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో కూడా మిల్లులకు ధాన్యం భారీగా వచ్చే అవకాశం ఉంది.

యాద్గార్‌పల్లి మిల్లుల వద్ద భారీగా నిలిచి ఉన్న ధాన్యం ట్రాక్టర్లు

గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

గ్రూప్-3 పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 16,543 మంది అభ్యర్థులు
- ఒరిజినల్ ఐడికార్డుతో పరీక్షకు హాజరుకావాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట, నవంబర్ 13 : టీజీపీఎస్సీ నేతృత్వంలో నెల 17,18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అందుకు జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి బుధవారం పరీక్ష నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్లు, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జిలు, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్స్, డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్లతో ట్రైనింగ్, కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో 30, కోదాడలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా వీటిలో 16,543 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తామని తెలిపారు. 9:30 నిముషాల తర్వాత అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించరని, ఒరిజినల్ ఐడీ కార్డులతో పరీక్షకు హాజరు కావాలన్నారు. 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, పరీక్ష సజవుగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీ కళాశాలలో ఏఎస్పీ సమావేశం

సూర్యాపేటటౌన్, : గ్రూప్-3 పరీక్షపై జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలో చీఫ్ సూపరింటెండెంట్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, రీజినల్ కో-ఆర్డినేటర్లకు ఏఎస్పీ నాగేశ్వర్‌రావు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సూర్యాపేట పట్టణంలో మొత్తం 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 8,951మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 68మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లి వేడుకలో బీఆర్ఎస్ నేతలు

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మేనల్లుడు భరత సింహారెడ్డి వివాహం బుధవారం హైదరాబాద్‌లోని తుర్కయంజాల్‌లో జరిగింది. పెండ్లి వేడుకకు మాజీ మంత్రులు కేటీఆర్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నేతలు బూడిద భిక్షమయ్యగౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సైదిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగం

సూర్యాపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యం

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

సూర్యాపేట టౌన్, నవంబర్ 13 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి సుమారు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షం రైతులను అతలాకుతలం చేసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 40,082 బస్తాల ధాన్యం వచ్చింది. పెద్దఎత్తున ధాన్యం రావడంతో ఎప్పటికప్పుడు అధికారులు హమాలీలు, కమీషన్ దారులను అప్రమత్తం చేస్తున్నప్పటికీ రాత్రి వరకు కాంటాలు కొనసాగాయి. ధాన్యాన్ని ఎగుమతి చేస్తుండగా రాత్రి 12గంటల తరువాత మరుసటి రోజు కొనుగోళ్లకు మార్కెట్‌లోకి ధాన్యాన్ని అనుమతిస్తారు. కొందరు రైతుల ధాన్యం రాత్రి వరకు కాంటాలు కాక పోవడంతో ఒక్కసారిగా వచ్చిన వర్షంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. రైతులు పట్టాల కోసం మార్కెట్ కార్యాలయంలోకి పరుగులు పెట్టారు. కొందరు రైతులు పట్టాలు తెచ్చి ధాన్యంపై కప్పగా.. పట్టాలు దొరుకని వారు తడుస్తున్న ధాన్యాన్ని చూస్తూ ఉండిపోయారు. ధాన్యం పెద్ద ఎత్తున రావడంతో కాంటా ఆలస్యమవుతుందని, అకాల వర్షాన్ని అంచనా వేయలేదని మార్కెట్ అధికారులు తెలిపారు. టెండర్ పూర్తయిన ధాన్యమే తడిసింది కాబట్టి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు.


మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు

రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు దుఃఖం తప్పడం లేదు

- జిల్లాలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసే దుస్థితి ఏర్పడింది
- జిల్లాలో సివిల్ సప్లయ్ మంత్రి ఉండి కూడా ప్రయోజనం లేదు
- మంత్రులు గాలి మోటర్లు దిగి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పర్యటించాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు
- మర్రిగూడ మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలన

మర్రిగూడ, నవంబర్ 13 : సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు దుఃఖం తప్పడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. వడ్లు తెచ్చి ఎన్ని రోజులు అవుతుందని అడిగారు. ఇప్పటివరకు ఏమైనా వాటి డబ్బులు అందాయా అని అడుగగా వడ్లు అమ్మి వారం రోజులైనా ఒక్క రూపాయి కూడా ఇప్పటి వరకు రాలేదని రైతులు వెల్లడించారు. దొడ్డు రకం వడ్లను మర్రిగూడలో.. సన్న రకం వడ్లను యరగండ్లపల్లిలో ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సన్నాలు ఇప్పటివరకు కొనడం లేదని మాజీ మంత్రి ఎదుట రైతులు వాపోయారు. తరుగు పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో సివిల్ సప్లయ్ మంత్రి ఉండి కూడా రైతులకు ప్రయోజనం లేదని.. ఇప్పటివరకు రైతులకు రూపాయి చెల్లించ లేదన్నారు. మంత్రులు గాలి తిరగడం మాని భూమి మీదకి రావాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు అయితే, సాగితే ఈసారి పుష్కలంగా నీళ్లు ఉండటం వల్ల ఐదున్నర లక్షల సాగు జరిగిందని తెలిపారు. ఏడున్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు మూడు లక్షల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. ధాన్యం దిగుబడి అంచనా వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా, రుణమాఫీ సరిగా చేయకుండా, పండించిన పంటలను కొనకుండా ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మండిపడ్డారు. జిల్లాలో ఇప్పటివరకు సన్నవడ్లను కొన్న దాఖలాలు లేవని, రేవంత్ రెడ్డి బోనస్ ఎలా ఇస్తాడని ప్రశ్నించాడు. రూ.1800కే క్వింటాలు చొప్పున అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే 200 రూ.కోట్లు చెల్లించాల్సి వస్తుందని.. అందులో ఇప్పటివరకు 50 కోట్లు మాత్రమే చెల్లించాలని అన్నారు. రైతులకు సకాలంలో డబ్బులు అందించే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదని చెప్పారు.

రైతుల ధర్నాలు రాస్తారోకోలు...

వడ్లకు మద్దతు ధర వస్తలేదని రైతులు మిర్యాలగూడలో రాస్తారోకో చేశారని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. కాటన్ మిల్లుల దగ్గర పత్తి రైతులు ధర్నాలు చేస్తున్న పరిస్థితిని చూస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వాన్ని నమ్మలేకనే దళారులను ఆశయించి వడ్లను అమ్ముతున్నారని తెలిపారు. కేసీఆర్ కరోనా కష్టకాలంలో కూడా రైతులకు రైతు బంధు కింద సాయం అందించడమే కాకుండా పండించిన పంటలను నిరాటంకంగా కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ కళ్లు తెరవాలన్నారు. ఈ యాసంగి పంటకైనా రైతులకు రైతు భరోసా కింద సాయం అందించాలని డిమాండ్ చేశారు.

గ్యారెంటీలకు ఇజ్జత్ లేకుండా చేసిన ప్రభుత్వం..

కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ అనే పదానికి ఇజ్జత్ లేకుండా చేసిందని హరీశ్‌రావు మండిపడ్డారు. రుణమాఫీ, రైతు భరోసా, తులం బంగారం, మహిళలకు 2500 రూపాయలు ఇస్తామని గ్యారెంటీ ఇచ్చినట్లు చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్యారెంటీలకు, బాండ్ పేపర్లకు విలువ, నమ్మకం లేకుండా పోయిందని విమర్శించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద రైతులందరికీ రుణమాఫీ చేస్తానని ఒట్టు వేసిన రేవంత్ రెడ్డి సగం మందికి కూడా పూర్తిస్థాయిలో మాఫీ చేయలేకపోయారని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, మాజీ ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి, రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు బాల నరసింహ, పందుల యాదయ్య, మాజీ సర్పంచులు నల్ల యాదయ్య, చెరుకు లింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ ఊరి పక్కన నగేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్, నాయకులు రాపోలు యాదగిరి, కోలుకులపల్లి యాదయ్య, వల్లంల సంతోష్ యాదవ్, లప్పంగి భిక్షం, పగడాల రఘు, వట్టికోటి శేఖర్ పాల్గొన్నారు.

చిట్యాల : ట్రామాకేర్ సెంటర్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రమాద బాధితుల కోసం ట్రామా కేర్ సెంటర్

- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

కట్టంగూర్/చిట్యాల, నవంబర్ 13 : రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు బుధవారం కట్టంగూర్ మండలంలోని పామనుగుండ్ల గ్రామ శివారులో, చిట్యాల మండలం గుండ్రాంపల్లిలోని సర్వే నంబర్ 485, పెద్దకాపర్తిలోని సర్వే నంబర్ 20/06 భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన బాధితులకు ట్రామా కేర్ సెంటర్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. ఆమె వెంట తాసీల్దార్లు గుగులోతు ప్రసాద్, కృష్ణ, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఎంపీఓ చిమల్ల చలపతి, ఆర్ఐ కుమార్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన ఉమ్మడి నల్లగొండ హాకీ బాలికల జట్టు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో నల్లగొండ జట్టుకు తృతీయ స్థానం

నల్లగొండ రూరల్, నవంబర్ 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో అండర్ -17 బాలికల విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. బుధవారం కరీంనగర్ జిల్లా జట్టుతో జరిగిన పోటీలో 2-0 తేడాతో నల్లగొండ జట్టు విజయం సాధించింది. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన ఎంజేపీటీ(అప్పాజీపేట పాఠశాల) విద్యార్థిని ధరణి, జడ్పీహెచ్ఎస్ తిమ్మాపురం స్కూల్ విద్యార్థిని ఝాన్సీని జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. కాంస్య పతకం సాధించిన జిల్లా జట్టును డీఈఓ భిక్షపతి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి విమల, హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం అభినందించారు. జట్టు కోచ్ యావర్, మేనేజర్ శ్రీనివాస్‌ను డీఈఓ అభినందించారు.